క్లుప్తంగా

వ్యాఘ్రేశ్వరునికి లక్ష బిల్వార్చన


స్వామికి సమర్పించిన టేకు తలుపులు

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో వేంచేసిన వ్యాఘ్రేశ్వర స్వామికి సోమవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

టేకు ద్వారాల సమర్పణ

పుల్లేటికుర్రులో వేంచేసిన బాలాత్రిపురసుందరి సమేత వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయంలో ఉన్న స్వామి అంతరాలయం వద్ద టేకు ద్వారాలను పిల్లాడి శ్రీనివాసు సోమవారం సమర్పించారు. రూ.లక్ష విలువ చేసే టేకు అంతరాలయం ద్వారాలు, తలుపులు అందజేశారు. అంతకు ముందు టేకు తలుపులకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి అనుగ్రహంతో తన కుమారుడికి ఉద్యోగం వచ్చినందుకుగాను స్వామికి టేకు తలుపులు పంపిణీ చేయించినట్లు భక్తుడు శ్రీనివాస్ తెలిపారు.

ఎస్సైలుగా ఎంపికైన అక్కచెల్లెళ్లకు అభినందనలు


ఎస్సై అక్కా చెల్లెళ్ళను అభినందించిన నాయకులు

మలికిపురం: గ్రామంలో పేద కుటుంబానికి చెందిన కడలి వెంకటేశ్వరరావు ఇద్దరు కుమార్తెలు కడలి రేవతి, కడలి కరుణ ఇద్దరు అక్కచెల్లెళ్ళు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఒకేసారి సెలెక్ట్ అయిన శుభ సందర్భంలో రాజోలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు వారిని ఆదివారం ఘనంగా సత్కరించారు. అనంతరం పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాల కృష్ణంరాజు మాట్లాడుతూ ఒకే ఇంట్లో ఒకేసారి ఇద్దరు అక్కచెల్లెళ్లు ఎస్సైలుగా సెలెక్ట్ అవ్వడం దేశంలోనే ఇదే ప్రథమమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ చిలకపాటి శ్రీధర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అల్లూరి మధురాజు, అప్పారి శీను, పిచ్చుక ప్రసాద్, మందపాటి కృష్ణ, బొల్లిగర్ల మనోజ్ పాల్గొన్నారు.

108లో ప్రసవం

మామిడికుదురు: పెదపట్నం గ్రామానికి చెందిన హైమావతి అనే గర్భిణికి పురుటి నొప్పులు రావడంతో సోమవారం 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. హైమావతికి నొప్పులు తీవ్రం కావడంతో 108లోనే డెలివరీ చేశారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని మెరుగైన వైద్యం కోసం వారిని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లామని ఎమర్జెన్సీ టెక్నీషియన్ సత్తెంశెట్టి రాము తెలిపారు. స్థానికులు 108 సిబ్బంది రాముతో పాటు పైలట్ నాగరాజును అభినందించారు.

ప్రభల ఉత్సవాన్ని విజయవంతం చేద్దాం

అంబాజీపేట: ఏటా కనుమ రోజున మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో నిర్వహించే ప్రభల ఉత్సవాన్ని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అందరం కలసికట్టుగా విజయవంతం చేద్దామని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఏఎ బి.వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్నారు. మొసలపల్లిలో వేంచేసిన భోగేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో 11 గ్రామాలకు చెందిన ప్రభల ఉత్సవ నిర్వాహకులు, గ్రామ పెద్దలు సోమవారం సమావేశమయ్యారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రభల తీర్థానికి సంబంధించి 11 గ్రామాలకు చెందిన నిర్వాహకులతో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. తీర్థంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ప్రభల కమిటీ నిర్వాహకులు చర్యలు తీసుకుని భక్తులకు సహకరించాలన్నారు. తీర్థంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. సమావేశంలో దంతులూరి శ్రీనివాసరాజు, సూర్యారావు, సతీష్‌రాజు, మోహనరాజు, కృష్ణంరాజు, శ్రీపాద వెంకటరమణ, అర్చకులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి జారి పడి తాపీమేస్త్రి మృతి


ప్రతాప్ (ఫైల్)

రాజోలు: మూడంతస్తుల భవనంపై నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి బి.సావరం గ్రామానికి చెందిన తాపీమేస్త్రి కొణతం ధనగంగా ప్రతాప్(44) మృతి చెందాడు. సోమవారం ప్రతాప్ కుటుంబాన్ని నాయకులు కడియం పూర్ణచంద్రరావు, కంచి వెంకటరమణ, కుంపట్ల చిన్నారి తదితరులు పరామర్శించారు. ఈ నెల 23న స్థానిక తాపీమేస్త్రీల సంఘ భవన సమీపంలో గారపాటి వీరబాబుకు చెందిన మూడంతస్తుల భవన నిర్మాణానికి వెళ్లాడు. అక్కడ మూడో అంతస్తు వద్ద పరంజీపై నిలబడి పని చేస్తుండగా ప్రతాప్ ప్రమాదవశాత్తూ జారి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కాగా రాజోలు ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం తరలించగా అప్పటికే ప్రతాప్ మృతి చెందాడని వైద్యులు ధృవీకరించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఓ కుమార్తె ఉన్నారు.


అంబాజీపేటలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు, దైవజనులు


కొత్తూరు బాప్టిస్ట్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న మత ప్రబోధకులు


కొత్తపేట యెరూషలెం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బిషప్ అబెద్నగో తదితరులు


అంతర్వేది దేవస్థానంలో క్రీస్తును ఆరాధిస్తూ గీతాలు ఆలపిస్తున్న క్రైస్తవులు

క్రీస్తు జననం ప్రపంచానికి పర్వదినం

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

అంబాజీపేట: లోకానికి యేసు క్రీస్తు ద్వారా వెలుగు వచ్చిందని, ఆ వెలుగును మన జీవితాల్లో ప్రకాశించే విధంగా చూసుకోవాలని పలువురు చర్చి ఫాదర్‌లు అన్నారు. అంబాజీపేట హడ్కో కాలనీలో ఉన్న కల్వరి క్రిస్టియన్ ప్రేయర్ హౌస్, చిల్డ్రన్ హోమ్‌లో ఏపీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిషప్ జల్లి జార్జిపాపఫ్, జల్లి విక్టర్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు వెలుగుకు గుర్తుగా కొవ్వొత్తులు వెలిగించారు. చిన్నారులు ఆలపించిన క్రిస్మస్ గీతాలను పలువురిని ఆకట్టుకున్నాయి. ఇరుసుమండ సెయింట్ జోసఫ్, అంబాజీపేట శివారు పోతాయిలంకలో త్రియేక దేవుని మందిరం, నందంపూడి సీయోను ప్రార్థన మందిరం తదితర చర్చిల్లో క్రీస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

క్రీస్తు బోధనలు శాంతి మార్గం: ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: క్రీస్తు బోధనలు ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపిస్తున్నాయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురంలోని గెద్దం ఫిలిప్‌రాజు కాంప్లెక్స్ ఆవరణలో హల్లెలూయ చర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ మహోత్సవంలో ఆయన పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో మలికిపురం జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి, నాయకులు కేఎస్ఎన్ రాజు, గెద్దం తులసీ భాస్కరరావు, గెద్దం ఫిలిప్‌రాజు, కొల్లాబత్తుల అశోక్ కుమార్, తాడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అలమూరులో..

అలమూరు: క్రిస్మస్‌ను పురస్కరించుకుని కులమతాలకు అతీతంగా పట్టణాలు, పల్లెలనే తారతామ్యం లేకుండా క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి.


మలికిపురం క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మండలంలోని వివిధ గ్రామాల్లో క్రీస్తు పుట్టిన రోజైన క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లోని క్రైస్తవ ఆలయాలను మత ప్రబోధకులు విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. మడికిలోని ఫైర్ ఆఫ్ రివైవల్ ప్రేయర్ చర్చి ఆవరణలో జాతీయ క్రిస్టియన్ కౌన్సిల్ ప్రతినిధి యు.సుందరం విజయం ఆధ్వర్యంలో, ఆలమూరులోని హోలీ పరిశుద్ధ ఆలయంలో పాస్టర్ జీజే సుధాకర్ ఆధ్వర్యంలో క్రీస్తు బోధనలు వినిపించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: క్రిస్మస్ సంబరాలు గ్రామాల్లో అంబరాన్ని తాకాయి. చర్చిల్లో క్రైస్తవులు ఆదివారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సాహంగా గడిపారు. చర్చిల్లో పాస్టర్లు, క్రైస్తవ మత పెద్దలు ఆధ్వర్యంలో క్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. స్థానిక లూథరన్ చర్చి, మన్నా చర్చి, స్థానిక ప్రవచన దేవుని సంఘం, పినిపేవారిపేట బైబిలు మిషను తదితర


పెదకందాలపాలెం ఎన్‌జేఎం చర్చిలో క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న దానియేలు

చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు ఇంట క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు అభిమానులు ప్రత్యేకంగా ఆయనతో కేక్‌లు కట్ చేయించారు. ప్రతిగా డేవిడ్‌రాజు కృతజ్ఞతలు తెలియజేస్తూ లోక రక్షకుడు ఏసుక్రీస్తు చూపిన శాంతి, సహనం సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని అన్నారు.


నగరం చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: సమస్త మానవాళికి శుభాన్ని కలగజేసే పండుగ క్రిస్మస్ అని పలువురు చర్చి పాస్టర్లు తెలిపారు. మండలంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తును స్తుతిస్తూ క్రైస్తవులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. సఖినేటిపల్లి సెంటినరీ ఏపీ ఫానియా లూథరన్, మూడుతూములు శాంతినగర్, బళ్లపేట లూథరన్ తదితర చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: ఏసుక్రీస్తు సూచించిన సన్మార్గంలో నడవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరం చర్చిలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కేకు కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మగటపల్లి సీయోను ప్రార్థనా మందిరంలో ఫాదర్ ఉండ్రు మోహనరావు, ఉండ్రు మోజెస్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంచారు. మామిడికుదురు క్రీస్తు రాజు దేవాలయంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పలు చోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు కేకులు కట్ చేసి, క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. నాగుల్లంక శివారు పెదకందాలపాలెం న్యూజెరూషలెం చర్చిలో రెవరెండ్ జి.దానియేలు ఆధ్వర్యంలో చిన్న పిల్లలు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పిల్లలు క్రిస్మస్ కేకును కట్ చేసి, క్రీస్తు పాటలు ఆలపించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి యు.జాన్‌బాబు, జె.దీప, కరుణకుమార్, ఎస్తేరు దానియేలు, నల్లి శ్రీచరణ్, ఎం.రాంబాబు, మొల్లేటి రాము పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని ప్రతి గ్రామంలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. అయినవిల్లిలంక ఆర్సీఎం చర్చిలో ఫాదర్ ఆధ్వర్యంలో ఏసయ్య మహిమలను వివరించారు. ఏసయ్య రాకతో మానవాళి జాగృతం అయిందన్నారు.

రూ.14.60 కోట్లతో సీసీ రోడ్లు


విశ్వేశ్వరాయపురంలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.14.60 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. మండలంలోని విశ్వేశ్వరాయపురంలో రూ.20 లక్షల గడప గడపకూ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనూ గడప గడపకూ కార్యక్రమం పూర్తయిందన్నారు. కోటి రూపాయల పనులకు మినహా మిగిలి అన్ని రోడ్లకూ నిధులు విడుదలతో పాటు పనులు కూడా పూర్తయినట్లు ఎమ్మెల్యే చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అనేక సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రతిపాదనలు అందించామన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్న కుమారి, పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు, ముత్యాల కాశి, కంచర్ల శేఖర్, గుబ్బల వీవీ సత్యనారాయణ, చెల్లుబోయిన బుచ్చియ్య మాస్టారు, కందుల విజయకుమార్, బూసి జాన్‌మోసే, గుబ్బల మనోహర్, చింతా రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి వేడుకలు


పి.గన్నవరం సీహెచ్‌సీలో పాలు, పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు


అప్పనపల్లిలో దుప్పట్లు, చీరలు పంచుతున్న బీజేపీ నేత

పి.గన్నవరం: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతిని మండల బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. బెల్లంపూడి గ్రామంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్, మాజీ సర్పంచ్ చీకరమెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి, నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. పి.గన్నవరం సీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు తిక్కా సత్యనారాయణ మూర్తి, అడ్డాల వెంకటేశ్వరరావు, దిగుమర్తి ఏడుకొండలు, మేడిది సత్యనారాయణ, అడబాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో

సఖినేటిపల్లి: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతిని సోమవారం సఖినేటిపల్లిలో బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా పార్టీ జెండాను మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు ఎగురవేశారు. అనంతరం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజులు గ్రామస్తులకు మిఠాయిలు పంచారు. భారత మాజీ ప్రధాని వాజ్‌పేయి సుపరిపాలన అందించారని వారు అన్నారు. ఆయన బాటలోనే ప్రధాని మోదీ నడుస్తున్నారన్నారు. పార్టీ ఉపాధ్యక్షుడు జీవీవీ సత్యనారాయణ, నాయకులు రావూరి బాబ్జీ, ఆకన వెంకట్రావు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో పేదలకు దుస్తులు పంపిణీ

మామిడికుదురు: భారత మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని అప్పనపల్లి, మగటపల్లి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. అప్పనపల్లి సాకావారిపేటలో పి.గన్నవరం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళలకు చీరలు, పేదలకు దుప్పట్లు పంచారు. మగటపల్లిలో నక్కా త్రిలోచనరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు అందించారు.

ముక్తేశ్వరంలో..

అయినవిల్లి: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి, సుపరిపాలన దినోత్సవ వేడుకలను సోమవారం ముక్తేశ్వరంలో మండల అధ్యక్షుడు కుడుపూడి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ భారత రాజకీయాల్లో ప్రతి ఒక్కరి మనసులో చెరగని ముద్ర వేసిన భారతావని ముద్దుబిడ్డ మన అటల్ బిహారీ వాజ్‌పేయి అని అన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులు యనమదల రాజ్యలక్ష్మి, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు, బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐలకు డీఎస్పీ సత్కారం

ఉప్పలగుప్తం: మండలంలోని ఇటీవల ఎస్ఐలుగా నియమితులైన ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన కుంచే శ్రీలత, గోపవరం గ్రామానికి చెందిన తాళ్ల రమేష్‌లను అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ ఘనంగా సత్కరించారు. మండలంలోని చల్లపల్లిలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణి ఆధ్వర్యంలో సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డీఎస్పీ అంబికా ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదలతో చదివి పోలీసు ఉద్యోగాన్ని ఎంచుకుని ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. ప్రజలకు సేవలందించేందుకు విధుల్లో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప్పలగుప్తం ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ కుంచే బుల్లియ్య, డీబీ లోక్, ఇసుకపట్ల రఘుబాబు, కుంచే చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధుల మంజూరు


చొప్పెల్లలోని కనక మహాలక్ష్మి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల అభివృద్ధికి, హిందూ ధర్మ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రికార్డు స్థాయిలో నిధులు మంజూరు చేయిస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని చొప్పెల్లలో రూ.కోటితో పునర్నిర్మించనున్న కనకమహాలక్ష్మి ఆలయానికి సోమవారం ఆయన భూమి పూజ చేశారు. తొలివిడతగా ఆలయ అభివృద్ధికి టీటీడీకి చెందిన శ్రీవాణి ట్రస్టు నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. దాతల సహకారంతో పాటు ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్న అనేక దేవాయాలను అభివృద్ధి చేసేందుకు రూ.కోట్లు మంజూరు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, సర్పంచ్ దంగేటి చంద్రకళ, ఉప సర్పంచ్ తోరాటి దుర్గారావు, మాజీ ఉప సర్పంచ్ సుంకర కామరాజు, వైఎస్సార్‌సీపీ యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దియ్యన పెదకాపు, మాజీ ఎంపీపీ తోరాటి రాంబాబు, దంగేటి బాపనయ్య, జాంప్రోలు అబ్బు తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడు మాధవకు ఎమ్మెల్యే సాయం


రాజమహేంద్రవరం ఆస్పత్రిలో మాధవను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పలివెల గ్రామ వలంటీర్ రావి మాధవానందస్వామి (మాధవ)ను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. కొత్తపేట మండలం పలివెలలో నిరుపేద కుటుంబానికి చెందిన మాధవ అర్చకుల వద్ద సహాయకుడిగా, గ్రామ వలంటీర్ పనిచేస్తూ కుటుంబ పోషణకు దోహదపడుతున్నాడు. అతను కిడ్నీ, లివరు సంబంధిత వ్యాధులకు గురై బాధపడుతూ రాజమహేంద్రవరంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆస్పత్రికి వెళ్లి మాధవను పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మాధవ అనారోగ్య పరిస్థితిని గురించి ఆరా తీశారు. మాధవ అనారోగ్య పరిస్థితిపై ఆందోళన పడవద్దని కోలుకుని సంపూర్ణ ఆరోగ్యవంతుడవుతాడని మాధవ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.40 వేలు సాయం అందజేశారు. జగ్గిరెడ్డి వెంట కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మునునూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి నాగిరెడ్డి, మార్గన రాము తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడి స్నేహితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: కిడ్నీ, లివర్ పాడై అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి వైద్యం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.16,500 నగదు సాయం అందజేశారు. కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన మాధవశర్మ వయస్సు 28 సంవత్సరాలు పౌరోహిత్యం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ప్రస్తుతం ఇతని ఆరోగ్యం క్షీణించి కిడ్నీలు లివర్ పాడైపోయాయి. ప్లేట్‌లెట్స్ పడిపోయాయి, డెంగీ ఫీవర్, కామెర్లతో ఆరోగ్యం క్షీణించింది. వైద్యం చేయించుకునే పరిస్థితి లేకపోవడంతో ఇతని ఫ్రెండ్స్ అందరినీ సహాయం కోరుతూ వైద్యం చేయిస్తున్నారు. స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థను సహాయం చేయమని కోరడంతో రావులపాలెంలో మాధవ శర్మ స్నేహితుడు మణికంఠకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.16,500 నగదు అందజేశారు.

వైభవంగా శోభాయాత్ర

పి.గన్నవరం: అయోధ్య రామ శోభాయాత్ర కార్యక్రమం సోమవారం పి.గన్నవరంలో ఘనంగా నిర్వహించారు. అయోధ్య నుంచి తీసుకు వచ్చిన బలరాముని స్వర్ణ అక్షితలను గ్రామంలో ఊరేగించారు. అయోధ్యరామ అక్షతలు, ఆహ్వాన పత్రాలు, శ్రీరాముని ఫొటోలను వచ్చే నెల 1 నుంచి ఇంటింటికీ పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విశ్వ హిందూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్రహ్మణ్యం, భమిడిపాటి కృష్ణమూర్తి, వి.రాంబాబు, ఎం.పరంధామయ్య, జి.శ్రీనివాస్, కె.రామకృష్ణ, ఈశ్వరి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జాతీయ భావనకు మనుస్మృతి విఘాతం


ముక్తేశ్వరం సెంటర్‌లో మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

అయినవిల్లి: భారతదేశంలో జాతీయ భావనకు మనుస్మృతి ఆది నుంచి అడ్డంకిగా నిలిచిందని సీనియర్ న్యాయవాది డీబీ లోక్ అన్నారు. సోమవారం ముక్తేశ్వరంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి లోక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం భారతీయ సమాజం విచ్ఛిత్తికి కారణమైన మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. సమానత్వం వర్ధిల్లాలని, ప్రతి మనిషికీ ఒకే విలువ గల సమాజం నిర్మాణం కావాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు అధ్యక్షుడు గిడ్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు కాకర బాబ్జీ, కాశి సత్యనారాయణ, కుసుమ బహుగుణ, వస్కా శ్యాంసుందర్, బొంతు రాజేంద్ర, పరమట నాని, కాకర అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు మామిడికుదురు సైన్స్ ప్రాజెక్ట్

మామిడికుదురు: మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి కడలి పీఎస్ఎస్ శ్రీరామ్ రూపొందించిన అగ్రికల్చరల్ ఇన్‌సెట్ ట్రీపర్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపికయిందని పాఠశాల హెచ్ఎం సీహెచ్ నిరంజని సోమవారం విలేకరులకు తెలిపారు. ఇటీవల రామచంద్రపురం నేషనల్ గవర్నమెంట్ హైస్కూలో జరిగిన జిల్లా స్థాయి సైన్సు ఫేర్ నుంచి ఈ ప్రాజెక్టును ఎంపిక చేశారని తెలిపారు. ఈ ప్రాజెక్టును టీచర్ చొప్పల గోపి గైడ్ చేశారన్నారు. వీరిద్దరినీ సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఐ.పోలవరం: ఐ.పోలవరం ఎదుర్లంక వారధి వద్ద గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మృతుడి వయసు 30 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. పసుపు రంగు టీషర్ట్, నీలిరంగు జీన్ ఫ్యాంట్ వేసుకుని ఉన్నాడు.